క్లుప్తంగా

ప్రజా సమస్యలపై కలెక్టరేట్ వద్ద సీపీఎం ధర్నా

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. పచ్చని కోనసీమలో తాగునీటి సమస్య దురదృష్టకరమని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారామ్, ఆండ్ర మాల్యాద్రి అన్నారు. కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాధితులతో కలసి ఉదయం నుంచి ధర్నా చేపట్టారు.మార్చి 25 నుంచి 28 వరకూ ప్రజా చైతన్య యాత్ర పేరుతో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు సైకిల్ యాత్ర నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా గుర్తించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి. దుర్గాప్రసాద్, ఎన్ బలరాం కె. కృష్ణవేణి జిల్లా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా శివ పంచాయతన యాగం



ఉమా మల్లేశ్వరుని ఆలయంలో శివ పంచాయతన యాగం చేస్తున్న పండితులు

అల్లవరం: దేవగుప్తంలో ఉమా పార్వతి సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మశ్రీ మరువాడ వెంకటేశ్వర శర్మ, పోచినపెద్ది శ్యామ్ శర్మ ఆధ్వర్యంలో నక్షత్ర పూర్వక నవగ్రహ సహిత శివ పంచాయతన యాగంలో రెండో రోజైన మంగళవారం అష్టోత్తర కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. బుధవారం అన్నాభిషేకం, పత్రి పూజ, నవగ్రహ నక్షత్ర పూజ, కుంకుమార్చన నిర్వహించనున్నట్టు శ్యామ్ శర్మ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

ముమ్మిడివరం: ఇటీవల వివిధ కారణాలతో మరణించిన యూనియన్ సభ్యులైన బాధిత కుటుంబ సభ్యులకు యూనియన్ తరపున ఆర్థిక సాయం అందజేశారు. ముమ్మిడివరంలో మంగళవారం వీరేశ్వర పెయింటింగ్ యూనియన్ సమావేశం అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ కారణాలతో మరణించిన యూనియన్ సభ్యులు పంపాని నాగేశ్వరరావు కుటుంబు సభ్యులకు రూ.5వేలు, కముజు నాగేశ్వరరావు కుటుంబానికి రూ. 15వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దుగ్గదుర్తి వెంకటేష్, కార్యదర్శి చింతకింద రామకృష్ణ, లంక చిన్న, గుత్తుల నాగేంద్ర పాల్గొన్నారు.

జీడిమెట్లకు సూపర్ లగ్జరీ బస్ సర్వీసు

అమలాపురం రూరల్: ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి 4వతేదీ నుంచి జీడిమెట్లకు సూపర్ లగ్జరీ బస్ సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ చల్ల సత్యనారాయణమూర్తి మంగళవారం తెలిపారు. ఈ బస్సు అమలాపురం నుంచి 4వ తేదీ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి వయా రావులపాలెం, విజయవాడ, లకిడికాపూల్, అమీర్‌పేట, బాలానగర్, చింతల్ మీదుగా జీడిమెట్లకు వెళుతుందన్నారు. తిరిగి 5వ తేదీన జీడిమెట్ల నుంచి రాత్రి 8.15 గంటలకు బయలుదేరి అమలాపురం వస్తుందన్నారు. ప్రస్తుతం అమలాపురం డిపో నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఈసీఐఎల్, డీహెచ్ఈఎల్, శంషాబాదు ఎయిర్ పోర్టుకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

యానాం చెత్తను ఆంధ్రాలో వేస్తే సహించం

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో పారిశుధ్య సమస్య నెలకొనడంతో ఆ చెత్తను ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో వేస్తున్నారని, అలా వేస్తే సహించేది లేదని తాళ్లరేవు మండల నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఈ సమస్యపై నాయకులు తహసీల్దార్ పితాని త్రినాథరావును కలసి వినతిపత్రం అందజేసారు. ఈ సమస్యను ఎమ్మెల్యే సుబ్బరాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, సాగి బాబ్జీరాజు, నడింపల్లి వినోద్, మోపూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఉచితంగా సరఫరా చేయాలి

తాళ్లరేవు: మండలం పరిధిలో చమురు సంస్థలు గ్యాస్ పైపులైన్ వేసి ప్రతి ఇంటికి ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేసారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసారు. దేశంలోనే పేరెన్నికగన్న రెండు చమురు సంస్థలు తాళ్లరేవు మండలంలో ఉన్నప్పటికీ మండల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ఆయా చమురు సంస్థల ద్వారా వెదజల్లుతున్న కాలుష్యం బారిన పడుతున్న స్థానిక ప్రజలను విస్మరించి ఇతర ప్రాంతాలకు సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. కాలుష్యం కారణంగా గాడిమొగ, పి.మల్లవరం, పోలేకుర్రు, తాళ్లరేవు, జార్జీపేట, నీలపల్లి తదితర ప్రాంతాల్లో కొబ్బరి దిగుబడి తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

రబీ సాగుకు నీటి ఎద్దడి

- అన్నదాతలకు ఏటా తప్పని అవస్థలు
- నీటి ఎత్తిపోతలకు ఇంజిన్ల వినియోగంతో అదనపు భారం
- ప్రభుత్వం నుంచి అందని సహకారం



ఉప్పలగుప్తం శివారులో నీటి ఎద్దటితో ఎండిన వరిచేను



ఉప్పలగుప్తం పాయకరావుకోడు డ్రెయిన్ నుంచి ఇంజిన్‌తో చేనుకు నీరు పెట్టుకుంటున్న దృశ్యం



పేరాయిచెరువులో ఇంజిన్ సహాయంతో చేనుకు నీరు తోడుతున్న రైతు

ఉప్పలగుప్తం: వ్యవసాయం దండగ అనే నాయకుల పాలనలో నేడు అన్నదాతల కష్టాలు తీర్చే నాథుడు కరువయ్యారు. రైతులు సాగుపై ఉన్న మక్కువతో ఆరుగాలం కష్టపడినా ఏటా నష్టాలను చవి చూడక తప్పడం లేదు. ఏటా ఎంతో ఆశతో రైతులు సాగు చేపట్టినా ఫలితం అంతంతమాత్రంగానే ఉంటోంది. రబీ సాగుకు నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉంది. రైతన్నకు ఈ ఏడాది ఆరంభం నుంచి అడుగడునా అవస్థలే ఎదురయ్యాయి.

దాళ్వా సాగు ఆలస్యం

తొలకరి సాగు సమయంలో ముంపు సమస్య, అధిక వర్షాలతో నష్టపోయిన రైతు దాళ్వాపై ఆశలు పెంచుకున్నాడు. ముందస్తు దాళ్వా సాగు చేద్దామనుకున్న రైతులకు ముంపు ప్రభావం కారణంగా నారుమడులు పోసుకునేందుకు నీరు దిగక సాగు ఆలస్యమైంది. తొలుత నారుమడుల్లో ఉన్న ముంపు నీటిని ఇంజిన్లతో తోడుకోవడానికి రైతు అదనపు వ్యయాన్ని వెచ్చించాల్సి వచ్చింది. అయినప్పటికీ కుంగిపోకుండా సాగుతున్న రైతుకు నీటి ఎద్దటితో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిలో వంతుల వారీ విధానంలో నీటిని అందిస్తున్న పంట కాలువలో నీరు చేలల్లోకి ఎక్కే పరిస్థితి కొన్ని గ్రామాల్లో కనిపించడం లేదు. కొన్నేళ్ల క్రితం పంట కాలువలో నీరు చేలల్లోకి నేరుగా ఎక్కేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేక ఇంజన్లతో తోడుకోవడంతో అదనపు ఖర్చు భారమైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించి పంట ఉత్పత్తులకు కనీస గిట్టుబాటు ధర అందించకపోతే ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చినా నష్టాలను చవిచూడటం తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అక్కరకు రాని వంతులు వారీ విధానం

అమలాపురం నియోజకవర్గంలో అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో 15,691 ఎకరాల్లో, ముమ్మిడివరం నియోజకవర్గంలో కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో 39,000 ఎకరాల్లో రబీ సాగు జరుగుతుంది. ఈ వంతులు వారీ విధానంలో సాగు నీరు అందుతున్నా అది సరైన సమయానికి అందక కొన్ని చోట్ల రైతులకు ఇబ్బంది తప్పడం లేదు. అమలాపురం మండలం తాండవపల్లి, వన్నెచింతలపూడి, రెడ్డిపల్లి ప్రాంతాల్లో సుమారుగా 220 ఎకరాలకు, అల్లవరం మండంలోని తుమ్మలపల్లి, కొమ్మరిగిరిపట్నం, గూడాల, తాడికోన, బెండకాలువ-1, బెండకాలువ-2 ప్రాంతాల్లోని 400 ఎకరాలకు, ఉప్పలగుప్తం మండలంలోని ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి పేరాయిచెరువు, ఆదిలక్ష్మీపురం, కూనవరం, అమ్మన్న అగ్రహారం, వానపల్లిపాలెం, బొంతువారిపాలెం, చినగాడవిల్లి ప్రాంతాల్లో 420 ఎకరాలు, ఐ.పోలవరం మండలంలో జి.మూలపాలెం, జి.వేమవరం, తిల్లకుప్ప, టి.కొత్తపల్లి శివారు భూముల్లో 500 ఎకరాలు, తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ శివారు భూముల్లో కొంతమేర సమస్యమైనప్పటికీ మండల వ్యాప్తంగా 600 ఎకరాల్లో, కాట్రేనికోన మండలం పల్లం శివారు గ్రామాలు లైన్‌పేట, బూలవారి మొండి, ఐ చెరువు, కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, సత్తమ్మ చెట్టు, వేట్లపాలెం, దొంతికుర్రు, కొప్పిగుంట, కందికుప్ప, లక్ష్మీవాడ గ్రామాల్లో సుమారుగా 400 ఎకరాల్లో సాగునీటికి ఇబ్బంది ఉంది.

భారీగా పెరుగుతున్న వ్యయం

ఈ ప్రాంతంలో సాగు నీరు నేరుగా చేలల్లోకి చేరకపోవడంతో ఇంజన్లను వినియోగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పంట కాలువలో ఒక ఇంజన్‌ను, చేను వద్ద మరొక ఇంజన్‌ను ఏర్పాటు చేసుకుని పంటకు నీరు పెట్టుకోవడంతో ఖర్చు భారీగా పెరుగుతోందని రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల చేలకు సమీపంలో ఉన్న డ్రెయిన్ల నుంచి ఉప్పు నీటిని సైతం రైతులు ఇంజన్లతో తోడుకుని వరి సాగుకు వినియోగించుకుంటున్నారు. సామాన్యంగా ఆరంభం నుంచి పంట చేతికి చేరే వరకు ఎకరా విస్తీర్ణంలో వరి సాగుకు దాదాపుగా రూ.30వేలు ఖర్చువుతుందని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో రూ.40 నుంచి రూ.45 వేలు ఖర్చువుతుందని అన్నదాతలు అంటున్నారు.

లాభాలపై ఆశ లేదు



17 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. 6 ఎకరాలు వ్యవసాయ భూమి పేరాయిచెరువు శివారు ప్రాంతంలో ఉంది. కొన్ని రోజులుగా సాగు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వంతుల వారీ విధానం నడిచినా శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. తొలకరిలో నష్టపోయాం, రబీ సాగుకు అదనపు ఖర్చు అవుతోంది. లాభాలు వస్తాయన్న ఆశ ఎలాగో లేదు. నష్టం వస్తుందన్న భయం ఎక్కువగా ఉంది.

– దోనిపాటి స్వామినాయుడు, రైతు, పేరాయిచెరువు, ఉప్పలగుప్తం మండలం

నేడు ఫ్యాప్టో నిరసన

అమలాపురం టౌన్: తమ డిమాండ్ల సాధన కోసం జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమైక్య (ఫ్యాప్టో) కలెక్టరేట్ వద్ద బుధవారం తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జిల్లాలోని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎంటీవీఎఎస్ సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే నిరసనపై ఫ్యాప్టో ప్రతినిధులు మంగళవారం చర్చించారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ప్రతీ ఉపాధ్యాయుడు హాజరై తమ డిమాండ్ల సాధనకు అందరూ నినదించాలని జిల్లా చైర్మన్ సుబ్బారావు సూచించారు. రాష్ట్ర ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు దశల వారీ పోరాటంలో భాగంగా ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ పోతంశెట్టి దొరబాబు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ పెంకే వెంకటేశ్వరరావు, సరిదే సత్య పల్లంరాజు, ఎం.మునేశ్వరరావు నిరసన కార్యక్రమంపై చర్చించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

అమలాపురం రూరల్: రాజకీయ వేధింపులు అరికట్టాలని కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లపై దాడులు పెరిగాయని విధుల నుంచి తొలగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గవారం క్రితం మండపేట ఫీల్డ్ అసిస్టెంట్‌పై రాజకీయ వేధింపులు వల్ల టి.రాజేశ్వరి ఆత్మహత్య ప్రయత్నం చేశారన్నారు. 16 సంవత్సరాల నుంచి ఆమెపై ఎటువంటి రిమార్కు లేకుండా విధులు నిర్వహిస్తున్నారని, బెస్ట్ అవార్డు అందుకున్నారని గుర్తు చేశారు. ఆమెకి ముగ్గురు పిల్లలు ఉన్నారని కూటమి ప్రభుత్వం ఒత్తిడి వల్లే ఫీల్డ్ అసిస్టెంట్‌లపై రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, ఫీల్డ్ సంఘం రాష్ట్ర నాయకుడు పరంధామయ్య తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అతి తక్కువ జీతంతో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని రాజకీయ వేధింపులు తక్షణమే ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పన్నుల వసూళ్లలో అమలాపురానికి ద్వితీయ స్థానం

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో 81.28 శాతంతో జిల్లాలో ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఇంటి పన్నుల డిమాండ్ రూ.9.83 కోట్లకు మార్చి 31 నాటికి రూ.7.99 కోట్లు వసూలు చేసింది. వారం రోజులుగా పన్నుల వసూళ్లలో ప్రతి రోజూ అమలాపురం మున్సిపాలిటీ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంటే గడువు తేదీ చివరి తేదీ మార్చి 31న ఒక్క రోజులో ద్వితీయ స్థానానికి చేరింది. చివరి రోజు ఒక్క రోజులో ఇంటి పన్నులు రూ.57.53 లక్షలు, ఖాళీ స్థలం పన్నులు రూ.10.47 లక్షలు, కుళాయి పన్నులు రూ.2.81 లక్షలు, షాపుల అద్దెలు రూ.5.11 లక్షలతో మొత్తం రూ.75.92 లక్షలు వసూలు చేశారని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. మున్సిపల్ షాపులకు డిపాజిట్లు, అద్దెల బకాయిలు కేవలం ఒకే నెలలో (మార్చి 1 నుంచి 31వ తేదీ వరకూ) రూ.37.43 లక్షలు వసూలు చేయడం జరిగిందన్నారు. మార్కెట్ కిస్తీ పాటకు సంబంధించి గతేడాది కంటే రూ.3.37 లక్షల మేర మున్సిపాలిటీకి ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. పన్నుల వసూళ్లలో జిల్లాలో ద్వితీయస్థానం సాధించినందుకు కమిషనర్ రాజు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు శ్రమించిన మున్సిపల్ రెవెన్యూ అధికారిణి భూపతి శ్రీలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, 15 వార్డు సచివాలయాల అడ్మిన్లు, సెక్రటరీలను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. పన్నుల చెల్లింపునకు చివరి గడువు రోజైన మార్చి 31వ తేదీ రాత్రి అర్ధరాత్రి వరకూ పన్నుల వసూళ్లను ప్రత్యేక డ్రైవ్‌తో నిర్వహించామని రెవెన్యూ అధికారిణి శ్రీలక్ష్మి వివరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అమలాపురం మాస్టర్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్

అమలాపురం టౌన్: అమలాపురం మాస్టర్ ప్లాన్ ఆమోదంతో స్థానిక మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవీ ఎంఎస్ నంబరు 57 ద్వారా మంగళవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మాస్టర్ ప్లాన్‌ను గతంలోనే మున్సిపల్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేసి అమలాపురం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీకి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చినప్పటికీ అందులో మున్సిపల్ కౌన్సిల్ సూచించిన కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. గత నెల 27న నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఈ విషయాన్ని ప్రకటించి అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ మాస్టర్ ప్లాన్‌ను ఆమోదించి కౌన్సిల్ ద్వారా మరోసారి ప్రభుత్వానికి పంపిద్దామని స్పష్టం చేశారు.



అమలాపురం ఏరియల్ వ్యూ

రోడ్ల వెడల్పునకు అవకాశం

మాస్టర్‌ప్లాన్ అమలు వల్ల ఇప్పుడున్న పట్టణ ప్రధాన రహదారులు మరింత వెడల్పుతో విస్తరించే అవకాశం ఉంటుంది. ప్రధాన రోడ్డు 40 నుంచి 60 అడుగులు, 80 అడగులు వరకూ వెడల్పు పెరిగేలా కౌన్సిల్ సూచించింది. కమర్షియల్ ఏరియా, రెసిడెన్షియల్ ఏరియాలను ప్రత్యేకంగా విభజించి మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు. అంతర్గత రోడ్ల వెడల్పును ఆ రోడ్ల ట్రాఫిక్ స్థాయి ఆధారంగా విస్తరించేలా పలు సూచనలున్నాయి. రోడ్లను 20 నుంచి నుంచి 40 అడుగుల వెడల్పు పెంచే సూచనలు చేశారు. భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) విధానం ద్వారా మాస్టర్ ప్లాన్‌ను రూపొంచినట్లు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ ఆర్ రాజు తెలిపారు. పట్టణంలో అగ్రికల్చర్ జోన్ లేకుండా అంతా కమర్షియల్, రెసిడెన్షియల్, మిక్స్‌డ్ జోన్లగా విభజించారు. పట్టణాన్ని ఆనుకుని ఉన్న 11 గ్రామాల విలీనాన్ని మాస్టర్ ప్లాన్‌లో చూపించారు. ఈ 11 గ్రామాలు వీలనమైతే ప్లాన్‌లో వెసులబాటు పెరుగుతుందన్నది మున్సిపాలిటీ ఆలోచన.

సర్వేశ్వరశర్మకు ఘన సత్కారం

అమలాపురం టౌన్: కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మకు కోనసీమ మేధావుల సంస్థ ఆధ్వర్యంలో అమలాపురంలో ఘన సత్కారం జరిగింది. డాక్టర్ సర్వేశ్వరశర్మ తన సైన్స్ పరిషత్ ద్వారా సైన్స్ అందరికీ సరళంగా అర్థమయ్యే రీతిలో విస్తృత ప్రచారం చేయడం ఆయన సేవా స్ఫూర్తికి అభినందనీయమని కోనసీమ మేధావుల సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్న డాక్టర్ సర్వేశ్వరశర్మను కోనసీమ మేధావులు సంఘ ప్రతినిధులు మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి ఘనంగా సత్కరించి అభినందించారు. రాష్ట్రం నుంచి సర్వేశ్వరశర్మ ఒక్కరే సైన్స్ పాపులరైజేషన్ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమని సంస్థ కార్యదర్శి కరాటం ప్రవీణ్ అన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.సంసోను, సంస్థ ప్రతినిధులు కేవీఆర్ఎస్ నరసింహరావు, కె.మనోహర్, యాలంగి వరప్రసాద్, ఆర్ఎస్ఆర్‌సీహెచ్ మూర్తి, డాక్టర్ కె.హేమ విజిత పాల్గొన్నారు.



డాక్టర్ సర్వేశ్వరశర్మను సత్కరిస్తున్న కోనసీమ మేధావుల సంస్థ ప్రతినిధులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నుంచి ప్రారంభించిన ప్రవేశ ఉత్సవాల్లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. అయ్యన్ననగర్, మెట్టకూరు తదితర ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రవేశ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం పుస్తకాలు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని ఆయన విద్యార్థులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, హెచ్ఎంలు దొమ్మేటి కృష్ణార్జునులు, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుబ్బాలమ్మకు పూజలు

అమలాపురం రూరల్: కామనగరువులో తాడిచెట్టు పాత సుబ్బాలమ్మ తల్లిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. మంగళవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. విశ్వరూప్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్‌లు నక్కా అరుణ కుమారి చంద్రశేఖర్, రేలంగి దుర్గారావు. పానకల గణేష్, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు. గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపూడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

యానాం: రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నేతాజీసుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ వలంటీర్ల 4వ రోజు ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధారణ, కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. అనంతరం వలంటీర్లతో కలిసి ఫెర్రీ రోడ్డులోని జాతీయ నాయకుల విగ్రహాలను నీటితో శుభ్రం చేశారు ఈ కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ వాసంశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

ఎస్సీ ఉద్యోగులపై వివక్ష తగదు

ముమ్మిడివరం: రాష్ట్ర ఎస్సీ ఉద్యోగులపై ప్రభుత్వ వివక్ష తగదని ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ముమ్మిడివరం శాఖ సమావేశం ఆరోపించింది. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన మండల శాఖ సమావేశం నిర్వహించారు. అమరావతిలో నిర్వహించిన పీ-4 సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో సెలవు దినమైనప్పటికీ రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న 130 మంది ఎస్సీ ఉద్యోగులకు డ్యూటీలు వేయడం దుర్మార్గమైన చర్య శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులను పీ-4 కార్యక్రమానికి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో బొజ్జా రమణశ్రీ, ఎం.ఆశీర్వాదం, జనిపెల్ల సత్యనారాయణ, కాశి వెంకటాచార్య, జనిపెల్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

బీవీసీలో పాలీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్

అమలాపురం రూరల్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసిన అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన కోసం,ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కోసం కాకినాడ, రాజమహేంద్రవరం దూర ప్రాంతాలకు ఇకపై వెళ్లాల్సిన అవసరరం లేదు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా అమలాపురం భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంగళవారం ప్రకటించింది. ఈ సౌకర్యాన్ని పాలీసెట్ విద్యార్థులు ఉపయోగించుకోవాలని కళాశాల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ ఫణి శంకర్ కోరారు.

నిధులు కేటాయించాలి

తాళ్లరేవు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పథకాలను అమలు చేయాలని ప్రజా సంఘాల నాయకులు టి.ఈశ్వరరావు, వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేసారు. మంగళవారం సంఘ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని వారు కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేసారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

ఐ.పోలవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిసాయి. పది పరీక్షలు గత నెల 17న ప్రారంభమైన విషయం తెలిసిందే. మొత్తం ఆరు సబ్జెక్టులకు సంబంధించి ఈ పరీక్షలు నిర్వహించగా మండల పరిధిలో నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల– ఏ సెంటరులో 96 మంది బాలురు, 104 మంది బాలికలు మొత్తం 200 మంది, బీ సెంటరులో 74 మంది బాలురు, 103 మంది బాలికల చొప్పున 177 మంది, జెడ్పీ ఉన్నత పాఠశాల మురమళ్ల సెంటరులో 112 మంది బాలురు, 128 మంది బాలికలు మొత్తం 240 మంది, మురమళ్ల సాయి ఉన్నత పాఠశాల నుంచి 83 మంది బాలురు, 97 బాలికలు 97 మంది కలిపి మొత్తం 180 మంది పరీక్షలు రాసారు.

పది పరీక్షలకు 751 మంది హాజరు

ముమ్మిడివరం: మండలంలో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ముమ్మిడివరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఠానేల్లంక ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్ష నిర్వహించారు. మండలంలో మొత్తం 753 మంది విద్యార్థులకు 751 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజయ్యారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

స్థానికులకు 25 శాతం రిజర్వేషన్ కల్పించాలి

యానాం: పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు భర్తీలో స్థానికులైన నాలుగు రీజియన్ల పరిధిలోని విద్యార్థులకు 25శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ ఎంపీ వైథిలింగం, బీజేపీ రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి తదితరులు ఉపరాష్ట్రపతి, వైస్‌చాన్సలర్ జగదీప్ ధన్‌కర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం 158 పీజీ, పరిశోధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని వారన్నారు. 1985లో ప్రారంభించిన 8 కోర్సుల్లో మాత్రమే 25 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని అనంతరం 21 కోర్సులకు పొడిగించారన్నారు. 2013 తర్వాత ప్రారంభించిన కొత్త కోర్సులకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని వారు కోరారు.

గోదావరి ఫుట్‌బాల్ టీమ్‌లో నరేంద్రకుమార్ ప్రతిభ



అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో అనంతపురం మైదానంలో గత నెల 20 నుంచి 28వ తేదీ వరకూ నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ)లోని క్రీడాకారుడైన అమలాపురానికి చెందిన రెడ్డి నరేంద్రకుమార్ ప్రతిభ చూపాడు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం తొలిసారిగా ఫ్రాంచైజీ విధానంలో నిర్వహించిన ఏపీ సూపర్ కప్ టైటిల్‌ను గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ కైవసం చేసుకుంది. ఈ క్లబ్ తరఫున ఆడిన 11 మంది ఫుట్‌బాల్ క్రీడాకారుల్లో నరేంద్రకుమార్ ఒకరు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి కుమారుడు నరేంద్రకుమార్. ఫైనల్‌లో గోదావరి ఎఫ్‌సీ జట్టు 2-1 స్కోరుతో కొల్లేరు ఎఫ్‌సీ జట్టుపై విజయం సాధించిందని నరేంద్రకుమార్ తెలిపారు. ఈ పోటీల్లో తమ జట్టు విన్నర్‌గా నిలిచి టైటిల్‌తో పాటు రూ.5 లక్షల నగదు బహుమతి గెలిచిందని నరేంద్రకుమార్ వివరించారు. ఈ విజయంతో గోదావరి జట్టు త్వరలో జాతీయస్థాయిలో ఒడిశాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఐ-లీగ్ 3కి అర్హత సాధించిందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో పరిశుద్ధ శిలువ యాత్ర

అమలాపురం టౌన్: అమలాపురం మహిపాలవీధిలోని అమలోద్భవి మాత పుణ్య క్షేత్రం నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ క్రైస్తవులు పరిశుద్ధ శిలువ యాత్ర మంగళవారం నిర్వహించారు. కేథలిక్ సంఘాలకు చెందిన క్రైస్తవులు శిలువ యాత్రలో పాల్గొన్నారు. ఈ యాత్రకు ఏలూరు ఆర్‌సీఎం పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి.బాలు పాల్గొని క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. క్రైస్తవులు శిలువ మోస్తూ క్రీస్తు గీతాలు ఆలపించారు. ఫాదర్ నాగోతు కిషోర్‌తో పాటు పలు చర్చిల ఫాదర్లు, పాస్టర్లు పాల్గొన్నారు. పీఠం వికార్ జనరల్ డాక్టర్ బాలును క్రైస్తవ విశ్వాసులు ఘనంగా సత్కరించారు.



డాక్టర్ బాలును సత్కరిస్తున్న పాస్టర్లు

ప్రజల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించొద్దు

యానాం: ప్రజల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించడం తగదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం మెట్టకూరు ఆది ఆంధ్రాపేటలో కొలువైన రామాలయంలో కొంత మంది దాతలు ఫ్లోరింగ్ టైల్స్ పనులు చేయిస్తుండగా కొంతమంది అడ్డుకునే ప్రయత్నం చేయడం తన దృష్టికి రావడంతో పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. నాలుగు రోజులుగా నిర్మాణ పనులు నిలిపి వేయించారని ఈ విషయంలో పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వ్యవహార శైలిని ఎమ్మెల్యే అశోక్ తీవ్రంగా విమర్శించారు. ఈ సమస్యపై అధికారులు అతిగా వ్యవహరించడం దారుణమని, ఆలయ పనులు చేస్తున్న వారికి నోటీసులు ఇవ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్‌ఏఓపై ఆగ్రహం

ఎటువంటి టెండర్లు, వర్క్ఆర్డర్లు లేకుండా ప్రభుత్వం పనులు మొదలు పెట్టడంపై ఆర్ఏఓ మునిస్వామిని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ప్రశ్నించారు. నాలుగేళ్లుగా ఆది ద్రావిడ శాఖ, ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు మంజూరైతే వాటికి సంబంధించిన అభివృద్ధి పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు కనుసన్నల్లోనే ఆర్‌ఏఓ పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్టకూరు తదితర గ్రామాల్లో డ్రైన్లు, రహదారుల నిర్మాణాలను బుధవారం చేపట్టాలని సూచించారు.

వైభవంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ పూజలు

యానాం: కొత్తపేట గ్రామంలో కొలువైన శ్రీమహాలక్ష్మమ్మవారి నూతన ఆలయం, విగ్రహం, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు మంగళవారం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మీ దంపతులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పీటలపై కూర్చొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

- డీఈవో డాక్టర్ బాషా



ఈదరపల్లిలో విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలిస్తున్న డీఈవో డాక్టర్ సలీం బాషా

అమలాపురం రూరల్: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా హెచ్చరించారు. అమలాపురం మండలం ఇందుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలలు మౌలిక సదుపాయాల కల్పనకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తరగతిగదిలో విద్యార్థుల విద్యాసామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ఐదవ తరగతి విద్యార్థుల ఇంగ్లీషు పరిజ్ఞానాన్ని పరిశీలించిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అసంపూర్తి నిర్మాణంతో వినియోగంలో లేని బాలికల టాయిలెట్లను ఆయన పరిశీలించారు. టాయిలెట్ల నిర్మాణానికి అవసరమైన నిధుల అంచనా తయారు చేయించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన ఈదరపల్లి హెచ్‌డీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలను తనిఖీ చేశారు. ఎన్‌రోల్‌మెంట్ పెంపుదలకు కృషి చేయాలని హెచ్ఎంకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరు నమోదు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు నిండిన అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు ఉన్నారు.